నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 22 జూన్ 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

కంపెనీలు మోసం చేస్తున్నాయి..

అమాయక రైతులను కంపెనీలు మోసం చేస్తున్నాయి. నేను వేద-999 వెరైటీని ఎకరన్నర పొలంలో సాగు చేశా. విత్తనాలు కంపెనీకి ఇచ్చా, పంట చేతికి వచ్చే వరకు కంపెనీ, ఆర్గనైజర్లు పర్యవేక్షణ చేశారు. అయితే కంపెనీ వారి ల్యాబ్‌లో జీవోటీ టెస్ట్ చేస్తే ఫెయిల్ అని రిపోర్టు ఇచ్చారు. అవే విత్తనాలను ప్రైవేట్ ల్యాబ్‌లో ఇస్తే పాస్ అయ్యాయి. ఇదేమని ప్రశ్నిస్తే కంపెనీలు ఆర్గనైజర్ల నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. ఇలా అమాయక రైతులను కంపెనీలు మోసం చేస్తూ రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు ఎగ్గొడుతున్నారు. వారు పెట్టుబడి కోసం ఇచ్చిన డబ్బుల కోసం కూడా ఒత్తిడి చేస్తున్నారు.

- నర్సింహులు, రైతు, నీలిపల్లి

అమాయక రైతులే వారి టార్గెట్

నాకున్న నాలుగున్నర ఎకరాల పొలంలో వేద, క్రిస్టల్ సీడ్ పత్తి పంట సాగు చేశా. పంట పూర్తైనా తర్వాత కంపెనీకి విత్తనాలు ఇచ్చా. కంపెనీ వారు నా విత్తనాలు ఫెయిల్ అయ్యాయని చెప్పారు. అవే విత్తనాలు ప్రైవేట్ ల్యాబ్‌లో టెస్ట్ చేస్తే పాస్ అయ్యాయి. ఒక్కో ల్యాబ్‌లో ఒక్కో రకంగా రిజల్ట్ ఎలా వస్తుందని కంపెనీలను ప్రశ్నిస్తే ఆర్గనైజర్లను అడగండి అంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నారు. దీంతో ఇటీవల మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు రైతు కమిషన్‌కు ఫిర్యాదు చేశాం. కమిషన్ చైర్మన్ జిల్లాలో పర్యటించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

- తిమ్మప్ప, రైతు, మల్దకల్

ఇటీవల హైదరాబాద్‌లో సమస్యలు పరిష్కరించాలని సీడ్ పత్తి రైతులతో కలిసి నినదిస్తున్న బీఆర్ఎస్ నేత విజయ్

కంపెనీలకు రైతులకు సంబంధాలు నిల్

ఫార్మర్ సఫర్!

- కంపెనీలు, ఆర్గనైజర్ల చేతిలో దగా పడుతున్న సీడ్ పత్తి రైతులు
- సాగు చేసిన విత్తనాలు పాసైనా.. ఫెయిల్ అంటూ నిలువునా మోసం
- కంపెనీలకు ఆర్గనైజర్ల వత్తాసు
- ఎవరికీ పట్టని సీడ్ పత్తి రైతుల గోస
- నడిగడ్డలో నలుగుతున్న వైనం

కంపెనీ, ఆర్గనైజర్ల పర్యవేక్షణలో పంట సాగు చేశా..

నాకున్న రెండున్నర ఎకరాల్లో వేద -666, రాయల్ సీడ్ విత్తన పత్తిని కంపెనీ, ఆర్గనైజర్ల పర్యవేక్షణలో చివరి వరకు పంట సాగు చేశా. పంట చేతికి వచ్చిన తర్వాత జీవోటీ పరీక్ష కోసం విత్తనాలను ఆర్గనైజర్లు కంపెనీకి ఇచ్చారు. కంపెనీ వారు పరీక్ష చేసి మీ విత్తనాలు ఫెయిల్ అయ్యాయని చెబుతున్నారు. రైతులకు చెల్లించాల్సి డబ్బులను ఎగ్గొట్టడానికే కంపెనీలు, ఆర్గనైజర్లు కుమ్మక్కై ఇలా చేస్తున్నారనే అనుమానం కలుగుతుంది. జిల్లాలో ఫెయిల్ అయిన రైతుల విత్తనాలను ప్రభుత్వ వ్యవసాయ ల్యాబ్‌లు లేదా, ప్రైవేట్ ల్యాబ్‌లో పరీక్షలు చేయించి రైతులను మోసం చేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలి.

- రాజు, రైతు, నీలిపల్లి

గద్వాల, జూన్ 21 : విత్తన పత్తి సాగుకు నడిగడ్డ నేలలు అనుకూలం కావడంతో, గత ఇరవై ఏండ్లుగా కంపెనీలు ఆర్గనైజర్లు అనే దళారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని ఇక్కడి రైతులతో సీడ్ పత్తి పంట సాగు చేయిస్తున్నారు. రైతులకు పెట్టుబడి కంపెనీలు, ఆర్గనైజర్లు ఇస్తుండడంతో నడిగడ్డ అన్నదాతలు ఎక్కువగా ఈ పంటవైపే మొగ్గు చూపుతున్నారు. మొదట్లో జోగులాంబ గద్వాల జిల్లాలో ఈ పంట సాగు సుమారు 50 వేల ఎకరాలకుపైగా చేశారంటే సీడ్ పత్తికి ఎంత డిమాండ్ ఉందో తెలిసిపోతుంది. ఇదే అదునుగా భావించిన కంపెనీలు, రైతులు పండించిన సీడ్ పత్తి విత్తనాలు విత్తన పరీక్ష చేస్తారు. విత్తన పరీక్ష విషయం అటు కంపెనీ, ఇటు ఆర్గనైజర్లకు మాత్రమే తెలుస్తుంది. ఈ విషయాన్ని రైతులకు పూర్తి స్థాయిలో వారు తెలియనీయడం లేదు. దీంతో ఆర్గనైజర్లు, రైతు పండించిన విత్తనాలు పాస్ అంటే పాస్.. ఫెయిల్ అంటే ఫెయిల్.. అనే పరిస్థితికి తీసుకెళ్లారు. అమాయక రైతులు వారు చెప్పిందే నిజ మనుకొని వారు ఇచ్చిన కాడికి డబ్బులు తీసుకునేటోళ్లు. ఇలా పంట సాగు చేసిన రైతులు అప్పుల పాలు కాగా, కంపెనీలకు దళారులుగా వ్యవహరిస్తున్న ఆర్గనైజర్లు మాత్రం కోట్లకు పడగలెత్తుతున్నారు. ఈ విషయం తెలియని అమాయక రైతులు కంపెనీలు, ఆర్గనైజర్లు చెప్పిందే వేదంగా భావిస్తూ ఇప్పటికీ వారు మోసం చేస్తున్నా వారినే నమ్ముతున్నారు. సీడ్ పత్తి సాగు చేసిన రైతులు ప్రతి ఏటా మోసపోతున్నా వారి గోడు ఇటు ప్రభుత్వం అటు వ్యవసాయశాఖ పట్టించుకోక పోవడంతో అరణ్య రోధనగానే మారిపోయింది.

నలిగిపోతున్న కర్షకులు

జిల్లాలో ప్రస్తుతం 40వేల ఎకరాల్లో రైతులు సీడ్ పత్తి సాగు చేస్తున్నట్లు తెలుస్తుంది. సీడ్ పత్తి సాగు చేసే రైతుల వివరాలు కేవలం కంపెనీలు, ఆర్గనైజర్ల దగ్గర మాత్రమే ఉంటున్నాయి. ఈ లెక్కలు వ్యవసాయశాఖ దగ్గర లేక పోవడం కంపెనీలకు, ఆర్గనైజర్లకు కలిసి వస్తుంది. రైతులకు సీడ్ ఇవ్వాల్సిన కంపెనీలు నేరుగా రైతులకు విత్తనాలు ఇవ్వడం లేదు. వారు ఆర్గనైజర్లు అనే దళారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని కంపెనీలు ఆర్గనైజర్లకు విత్తనాలు ఇస్తే ఆర్గనైజర్లు రైతులకు సరఫరా చేస్తున్నారు. సీడ్ పత్తి సాగు చేసే రైతులకు కొంత పెట్టుబడి రూపేణా కంపెనీలు, ఆర్గనైజర్లకు ఇస్తే ఆర్గనైజర్లు రైతులకు ఇస్తున్నారు. ఇప్పటి వరకు బాగానే ఉన్నా రైతులు సాగు చేసిన పంట వివిధ కారణాల చేత చేతికి రాకున్నా, విత్తనాలు ఫెయిల్ అయినా కంపెనీలు రైతులను ప్రశ్నించరు. ఎందుకంటే కంపెనీలకు రైతులకు నేరుగా సంబంధాలు ఉండవు. విత్తనాలు ఫెయిలైతే రైతులు చెల్లించాల్సిన డబ్బుల విషయంలో కంపెనీలు ఆర్గనైజర్లపై ఒత్తిడి తేవడం, ఆర్గనైజర్లు రైతులపై ఒత్తిడి తీసుకురావడంతో ఇద్దరి మధ్య రైతులు నలిగి పోతున్నారు. పంటనష్టం నమోదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే రైతులు సాగు చేసిన సీడ్ పత్తి వివరాలు వారి దగ్గర లేకపోవడంతో వారి సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు.

విత్తన ప్యాకెట్లను చూయిస్తున్న రైతులు

విత్తనాలు పాసైనా.. ఫెయిల్ అని చెబుతూ బురిడీ..

రైతులు సాగు చేసిన సీడ్ పత్తిని విత్తనం వేరు చేసిన తర్వాత జీవోటీ టెస్ట్ కోసం కంపెనీలు తీసుకుంటాయి. అయితే రైతులు కంపెనీలకు మంచి విత్తనాలు ఇచ్చినప్పటికీ వాటిని ఫెయిల్ అయ్యాయని చెబుతుండడంతో రైతులకు ఏమి చేయాలో తోచడం లేదు. అనుమానం వచ్చిన కొంత మంది రైతులు ప్రైవేట్ ల్యాబ్లలో పరీక్షలు చేయిస్తే పాస్ అని రావడంతో కంపెనీలు తమను మోసం చేస్తున్నాయని, తమకు సహకరించాల్సిన ఆర్గనైజర్లు కంపెనీలకు వత్తాసు పలుకుతున్నారు. దీంతో తమకు న్యాయం చేయాలని మల్దకల్, ఇటి క్యాల మండలాలకు చెందిన రైతులు నక్క రాముడు, నర్సింహులు, తిమ్మప్ప, రాజు, జయ రాములు, జయన్న తదితరులు తమ విత్తనాలు పాస్ అయినప్పటికీ కంపెనీలు, ఆర్గనైజర్లు ఫెయిల్ అయినట్లు చెబుతున్నారని, ప్రైవేట్ ల్యాబ్‌లో పరీక్షలు చేయిస్తే తమ విత్తనాలు పాస్ అయినట్లు రిపోర్టు వచ్చిందని వారితోపాటు మరి కొందరు రైతులు హైదరాబాద్‌లో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి ఫిర్యాదు చేశారు. అందుకు స్పందించిన కమిషన్ జిల్లాలో పర్యటించి రైతులతో కూడా మాట్లాడారు. రైతుల కష్టాలు తెలుసుకొన్నారు.

వనపర్తిలో ముఖ్య నాయకుల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఎన్నికలయ్యాక రైతుభరోసాకు రాంరాం

- స్థానిక పోరు తర్వాత సాయాన్ని ఎత్తేసేందుకు సర్కారు ప్రయత్నం?
- పరిపాలనలో, అన్నిరంగాల్లో విఫలం
- కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలి
- బీఆర్ఎస్ గెలుపునకు పాటుపడాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, జూన్ 21 : స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతుభరోసాకు కాంగ్రెస్ పార్టీ రాం..రాం.. పలుకడం ఖాయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం అనివార్యమన్నారు. అందుకే బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. ముఖ్య నాయకులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు ఎట్లా తూట్లు పొడిచిందో వివరించాలని, పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమై వ్యతిరేకత మూటగట్టుకున్నదని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రస్తుతం తెలంగాణ సాధించి అభివృద్ధి చేసిన కేసీఆర్ పరిపాలన వైపు చూస్తున్నారని, ఈ క్రమంలో ఎన్నికల్లో గెలుపు కోసం అహర్నిషలు పాటుపడాలని సూచించారు. పార్టీ పట్ల నిబద్ధత, ప్రజలకు మంచి చేయాలనే విశ్వాసం గల వారిని అభ్యర్థులుగా నియమించాలన్నారు. అనంతరం గ్రామాలవారీగా నాయకుల అభిప్రాయాలు స్వీకరించి సూచనలు చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పీ.రమేశ్‌గౌడ్, మీడియా కన్వీనర్ అశోక్, మండల అధ్యక్షుడు బాలరాజు, శివరాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భీమన్న, మాజీ ఎంపీపీలు సంధ్య తిరుపతయ్య, సేనాపతి, మాజీ సర్పంచులు రమేశ్, శేఖర్, హర్యానాయక్, మతీన్, స్వామి, రాము, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సోదరుడి పర్యటనలో పోలీసుల అత్యుత్సాహం

కోస్గి, జూన్ 21 : అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం కోస్గి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ సామాన్యులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. శనివారం కోస్గి పట్టణంలో కొగంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పలు అభివృద్ధి పనుల్లో భాగంగా శివాజీ కూడలిలో సమావేశం నిర్వహించారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు భద్రత పేరుతో సామాన్యుల వాహనాలను అటువైపు వెళ్లకుండా నిలువరించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే నాయకుల వాహనాలు వెళ్లే వరకు ఆగాల్సిందేనని హుకుం జారీ చేశారు. రద్దీ ప్రాంతంలో సమావేశాల పేరుతో ప్రయాణికులను ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలు మండిపడ్డారు.

రేటింగ్ పేరుతో ఘరానా మోసం

- యువతి అకౌంట్ నుంచి రూ.28,495 మాయం

అలంపూర్ చౌరస్తా, జూన్ 21 : ఫైవ్ స్టార్ రేటింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు యువతిని బురిడీ కొట్టించి అకౌంట్‌లో డబ్బులు మాయం చేసిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లిలో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి ఎస్సై శేఖర్ కథనం ప్రకారం.. ఉండవెల్లి మండల కేంద్రానికి చెందిన షేక్ షాజియాకు ఈ నెల 17వ తేదీ రాత్రి 7గంటల సమయంలో మొబైల్‌కు ఓ లింక్ వచ్చింది. రెస్టారెంట్లు, హోటల్స్, కాఫీ షాపులకు 5 స్టార్ రేటింగ్ అందిస్తే మీకు ఒక్కొక్క రేటింగ్‌కు రూ.50 చెల్లిస్తామని చెప్పారు. దీంతో ఆమె లింకును ఓపెన్ చేసి తన వ్యక్తిగత, బ్యాంక్ వివరాలను నమోదు చేసింది. టెలీగ్రామ్‌లో కొన్ని టాస్కులు ఇస్తామని, వాటిని కూడా చదివి రేటింగ్ ఇవ్వాలని మరో మెసేజ్ వచ్చింది. మరుసటి రోజు ఆమెకు చెప్పినట్లు కొంత డబ్బును అకౌంట్‌లో జమ చేశారు. అదేవిధంగా రేటింగ్ ఇస్తే అమౌంట్ మరింత ఇస్తామని, రేటింగ్‌తో వచ్చే డబ్బులు మొత్తం వేయాలంటే మీరు కూడా డబ్బులను పంపాలని నమ్మించారు. దీంతో రూ.28,495లను సాజియా వారి అకౌంట్‌కు పంపింది. మీ డబ్బులు మీకు కావాలంటే మళ్లీ రూ.68వేలు పంపాలని మెసేజ్ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించి శనివారం ఉండవెల్లి పోలీసులను సంప్రదించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉడుములు వేటాడిన ఇద్దరికి రిమాండ్

రిమాండ్‌కు తరలిస్తున్న అధికారులు

అమ్రాబాద్, జూన్ 21 : మద్దిమడుగు రెయింజ్ పరిధిలో ఉడుములను వేటాడిన కేసులో ఇద్దరికి రిమాండ్‌కు విధించినట్లు రెయింజ్ అధికారి ముజీబ్‌ఘోరీ శనివారం తెలిపారు. ఈనెల 17వ తేదీన బాపంపాడు బీట్ ఏరియాలో ఉడుములను వేటాడి ఇప్పలపల్లికి చెందిన హన్మంతు, ఉడిమిళ్లకు చెందిన మోతీలాల్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకొని విచారించగా, నేరాన్ని ఒప్పుకున్నారని తెలిపారు. కల్వకుర్తి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 14రోజుల రిమాండ్‌ను విధించారన్నారు.

రోడ్డున పడేస్తారా?

ఆర్థికసాయం, బియ్యం పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నేత జూపల్లి భాస్కర్‌రావు

- ఇండ్లు కోల్పోయిన బాధితులకు పునరావాసమేదీ?
- బాధితులను సర్కారు అన్ని విధాలుగా ఆదుకోవాలి
- బీఆర్ఎస్ నేత, సింగిల్ విండో చైర్మన్ భాస్కర్‌రావు
- బాధితులకు ఆర్థికసాయం, బియ్యం పంపిణీ

చారకొండ, జూన్ 21 : అపర భద్రాద్రిగా పేరుగాంచిన సిరుసనగండ్ల సీతారామ చంద్రస్వామి ఆలయ భూముల్లో ఇండ్లు కోల్పోయిన పేదలు రోడ్డున పడ్డా ప్రభుత్వం కనికరం చూపడం లేదని, బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని బీఆర్ఎస్ నేత, సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని సిరుసనగండ్ల(అ యోధ్యనగర్)లో ఇండ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించారు. అధికారులు తమను భయభ్రంతులకు గురి చేశారని, ఇండ్లకు కూల్చొద్దని కాళ్ల మీద పడినా పక్కకు నెట్టేసి నేలమట్టం చేశారని వాపోయారు. అధికారులు సమావేశం పెట్టినప్పుడు 25రోజులు సమయం ఇవ్వాలని అడిగినా ఏమాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ కోర్టు ఆదేశాలున్నప్పటికీ ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా పునరావాసం కల్పించి కూల్చివేస్తే బాగుండేదని చెప్పారు. దేవున్ని నమ్ముకొని జీవనం గడుపుతున్న పేదల గూడును చెదిర గొట్టి రోడ్డున పడేశారని మండిపడ్డారు. ఇండ్లు కూలి పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నా అధికారులు, ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదన్నారు. బాధితులకు పునరావాసం కల్పించి, పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తన సొంత ఖర్చులతో 34 మందికి 25 కేజీల బియ్యం తోపాటు బాధిత కుటుంబాలకు రూ.10వేల చొప్పున అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు యాతం శారదశ్రీను, సాయికుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, యూత్ ప్రెసిడెంట్ చండీశ్వర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ రవితేజ, బీఆర్ఎస్ నాయకులు రమేశ్, సలీం, కమలాకర్‌రావు, శ్రీశైలం, శ్రీను, రాంలాల్, జూమ్లానాయక్, మధు, మహేశ్‌గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో బుల్డోజర్ల బెంబేలు

- కాటేజీలోని హోటల్ ధ్వంసానికి అధికారుల యత్నం
- అడ్డుకున్న బీఆర్ఎస్, బీజేపీ నేతలు

భవనం వద్ద గుమిగూడిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

కొల్లాపూర్ రూరల్, జూన్ 21 : కొల్లాపూర్ మండలం సోమశిలలో అధికార పార్టీ ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలు మరోసారి బయటపడ్డాయి. బీఆర్ఎస్ నాయకుడు సందు ఆంజనేయులు, బీజేపీ నాయకుడు సందు రమేశ్ సోమశిల సమీపంలోని కాటేజీలో హోటల్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆధీనంలోని ఈ భూమి ఉందని సంబంధిత అధికారులు శనివారం బుల్డోజర్లతో హోటల్ వద్దకు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఆంజనేయులు, రమేశ్‌తోపాటు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకొని అధికారులను అడ్డగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పనిచేయలేదని ఉద్దేశపూర్వకంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాపై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని ఆంజనేయులు, రమేశ్ ఆరోపించారు. మాపై కక్ష గట్టి అన్ని అనుమతులున్నా కూల్చివేస్తే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని బాధిత కుటుంబ సభ్యులు అధికారులను హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నేతల తోపాటు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు సోమశిలకు చేరుకొని జిల్లా పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. డీపీవో రామ్మోహన్‌రావు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉండగా, అక్కడికి వెళ్లి సమస్య అడిగి తెలుసుకున్నారు. భవనాలు కూల్చివేయకుండా కోర్టులో స్టే తీసుకున్నామని, అత్యుత్సాహం ప్రదర్శిస్తే సహించేది లేదని చెప్పడంతో అధికారులు వెళ్లి పోయారు. ఈ విషయమై డీపీవోను మీడియా వివరణ కోరగా కొల్లాపూర్ తాసీల్దార్ ప్రభుత్వ భూమిగా నిర్ధారించారని, ఈ మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ప్రియురాలిని హత్య చేసిన ప్రియుడు

- కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ మొగిలయ్య

గద్వాల అర్బన్, జూన్ 21 : కేటీదొడ్డి మండలం పాతపాలెంలో ఈనెల 16వ తేదీన అనిత అనే మహిళ అనుమానాస్పదంగా మృతిచెందగా, విచారణలో హత్యగా గుర్తించినట్లు డీఎస్పీ మొగిలయ్య తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఇందుకు సంబంధించి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మృతురాలి తమ్ముడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, బోయ అనిత(26) ధరూర్ మండలం కోతులగిద్దెకు చెందిన ఆంజనేయులుతో కొన్నేండ్ల కిందట వివాహం చేశారు. కోతులగిద్దెలో అనిత భర్త తరపు బంధువులకు ఘర్షణలు ఉండడంతో తల్లిగారి గ్రామమైన పాతపాలెంలో ఇల్లు కొను క్కొని ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నది. ఆర్థిక పరిస్థితులు బాలేక పోవడంతో భర్త ఆంజనేయులు హైదరాబాద్‌లో కూలీగా పని చేసేందుకు వెళ్లాడు. నెలకు రెండు, మూడు సార్లు ఇంటికి వచ్చి భార్యాపిల్లలను చూసుకు నేవాడు. ఈ క్రమంలో పాతపాలెం గ్రామానికి చెందిన దళాయి మాల రంగస్వామిని అనిత పెళ్లికి ముందే ప్రేమించి పెళ్లిచేసు కోవాలనుకోగా, కులాలు వేరు కావడంతో వేర్వేరు పెళ్లిల్లు చేసుకున్నారు. అనిత తిరిగి గ్రామంలోకి రావడం, ఆర్థిక పరిస్థితులు బాగా లేక పోవడంతో డబ్బులిస్తూ పాత పరిచయం కాస్త అక్రమ సంబంధానికి దారి తీసింది. ఇదే క్రమంలో ఈనెల 15వ తేదీన మద్యం తాగిన రంగస్వామి తన భార్య, తల్లిదండ్రులతో గొడవకు దిగాడు. అక్కడి నుంచి రాత్రి 11గంటల సమయంలో ప్రియురాలు అనిత ఇంటికి చేరుకొని వేరే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంటావా అంటూ అనితతో రంగస్వామి గొడవకు దిగాడు. ఈ క్రమంలోనే రంగస్వామి అనితను చీరతో మెడకు బిగించి హత్య చేసి అనుమానం రాకుండా ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు చిత్రీకరించాడు. కాగా, మృతురాలి మెడకు ఉన్న గాయాలను గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు విచారణ చేపట్టారు. అనిత ఫోన్‌కాల్స్ ఆధారంగా శనివారం దలాయి రంగస్వామిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా, అనితను హత్య చేసినట్లు అంగీకరించాడన్నారు. రంగస్వామిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసు చేధించిన సీఐ శ్రీనివాసులు, కేటీదొడ్డి ఎస్సై శ్రీ నివాసులను ఎస్పీ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

కృష్ణమ్మ గలగల..

ఇటిక్యాల, జూన్ 21 : ఎగువన కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మకు వరద వచ్చి చేరుతున్నది. దీంతో బీచుపల్లి పుష్కర ఘాట్ వద్ద కృష్ణానది 80వేల క్యూసెక్కులకు పైగా వరద ప్రవహిస్తోందని అధికారులు తెలిపారు.

జారితే ఆటో.. ఇటో..

– రఘు, ఫొటోగ్రాఫర్ జోగులాంబ గద్వాల

వానకాలం పంటల సీజన్ ప్రారంభమవడంతో వ్యవసాయ కూలీలకు మస్త్ డిమాండ్ పెరిగింది. విత్తనాలు విత్తేందుకు.. కలుపు తీసేందుకు అవసరం ఉండడంతో కొన్ని ప్రాంతాల్లో కొరత ఏర్పడింది. దీంతో పక్క గ్రామాలు, జిల్లాల నుంచి కూలీలను ఉదయం ఆటోలు, ఇతర వాహనాలలో తీసుకొని సాయంత్రం మళ్లా వదిలిపెడ్తున్నారు. అయితే వీరిని తరలించే ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కెపాసిటీకి మించి కూలీలను ఎక్కించుకుంటున్నారు. తప్పని పరిస్థితులలో వారు ప్రాణాలను ఫణంగా పెట్టి ఆటోలను పట్టుకొని వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఇవి నిత్యాకృత్యమైనా.. పాలకులు గానీ.. అధికారుల గానీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.